సాక్షి
మంచిర్యాల
సోమవారం । 24 । మార్చి । 2025



కోరలుచాస్తున్న 'క్షయ' 8లో▸

ఉమ్మడి జిల్లాలో చాపకింద నీరులా క్షయ వ్యాప్తి చెందుతోంది. సోమవారం టీబీ నివారణ దినం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కేసుల వివరాలతో కథనం.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ : 6:24	మంగళ : 5:00

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /23.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేడి, ఉక్క పోత కూడా పెరుగుతుంది. రాత్రి వేళలో చల్లగా ఉంటుంది.

బావి ఇంకింది.. వరి ఎండింది!



వేసవి ఎండలు ముదురుతున్నాయి. భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. బోర్లు, బావులు ఎండిపోతున్నాయి. దీంతో నీరందక పంటలు ఎండిపోతున్నాయి.జన్నారం మండలం పొనకల్ శివారులో సత్తయ్య బావి కింద యాసంగిలో వరి వేశాడు. అయితే బావిలో నీరు అడుగంటడంతో వరి పంటకు నీరందడం లేదు. దీంతో కొంత పొలాన్ని వదిలేశాడు. బావినీరు చాలక వదిలేసినట్లు రైతు తెలిపాడు. - (జన్నారం)





చెలిమె.. చేతిపంపే దిక్కు

భానుడు భగ్గుమంటున్నాడు.. ఉష్ణోగ్రతలు తీవ్రమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భీమిని మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. తాగునీటి పథకాల ద్వారా సరిపడా నీరు సరఫరా కావడం లేదు. మామిడిగూడ గ్రామస్తులు తాగునీటి కోసం ఉదయం వాగుకు వెళ్తున్నారు. చెలిమె నీటిని బిందెలు, క్యాన్లలో నింపుకుని తెచ్చుకుంటున్నారు. వడాల గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదు. ఎస్సీ కాలనీలో ఉన్న చేతిపంపు సైతం చెడిపోయింది. ఇళ్లలో వేసుకున్న బోరు నీరే తాగుతున్నారు. - (భీమిని)

న్యూస్‌రీల్

కేకే ఓసీని సందర్శించిన డైరెక్టర్



పని ప్రదేశాలను పరిశీలిస్తున్న డైరెక్టర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వర్లు ఆదివారం సందర్శించారు. పని స్థలాలను ఏరియా జీఎం దేవేందర్‌తో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టు అధికారులకు సూచనలు చేశారు. వారం రోజుల్లో ఆర్థిక లక్ష్యం పూర్తవుతుందని, సంస్థ నిర్దేశిత లక్ష్య సాధన కోసం అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఎస్వో టూ జీఎం విజయ్‌ప్రాద్ కేకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, కేకే గ్రూపు ఏజెంట్ రాంబాబు, ఏరియా ఇంజినీర్ వెంకటరమణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్ ఉన్నారు.

కవితా పోటీల్లో ప్రథమ బహుమతి



రవికుమార్‌ను సన్మానిస్తున్న చైర్మన్

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారం గ్రామానికి చెందిన కాపురవు రవికుమార్‌కు కవితా పోటీల్లో ప్రథమ స్థానం దక్కింది. బోయి భీమన్న జీవితం–సాహిత్యంపై నిర్వహించిన కవితా పోటీలో రవికుమార్ ప్రథమ స్థానం దక్కించుకున్నారు. రాజమహేంద్రవరంలో ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ భీమన్న సాహితీ నిధి ట్రస్ట్, కళావేదికలో బోయి భీమన్న సతీమణి హైమావతి, కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తదితరుల చేతుల మీదుగా రవికుమార్ ఆదివారం బహుమతి అందుకున్నారు.

పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గించే కుట్ర



మాట్లాడుతున్న కలవేణి శంకర్

బెల్లంపల్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతి నిధ్యం తగ్గించే కుట్రలు చేస్తోందని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్ ఆరోపించారు. సీపీఐ శత జయంతోత్సవాలు పురస్కరించుకుని బెల్లంపల్లి గంగారాం విజ్ఞాన్ భవన్‌లో అసెంబ్లీ నియోజకవర్గస్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శంకర్ హాజరై మాట్లాడారు. 1925లో దేశంలో పురుడు పోసుకున్న సీపీఐ శతజయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. పీడిత తాడిత అట్టడుగువర్గాలు, కార్మి కులు, కర్షకుల హక్కుల కోసం సీపీఐ అలు పెరుగని పోరాటాలు సాగిస్తోందని వివరించా రు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద విధానాలు అవలంబిస్తోందన్నారు. భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను దెబ్బతిస్తూ డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతి నిధ్యం తగ్గించేందుకు కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. రైతు చట్టాలనుతుంగలో తొక్కి ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో నిర్లక్ష్యం వహిస్తోందని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు ఎం .వెంకటస్వామి, బి.పూర్ణిమ, మేకల దాసు, ఆర్.చంద్రశేఖర్, జిల్లా సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేశ్, అక్కెపల్లి బాపు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, నాయకులు రాజేశ్, సంతోష్, మాణిక్యం, శ్రీధర్, బానేష్, రాజేశం, అమృత, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలుకు.. ఆపసోపాలు!

- అప్‌గ్రేడ్ అయినా మారని వసూళ్ల తీరు..
- మొండిబకాయిదారులపై దృష్టిసారిస్తే మేలు
- వారం రోజులే గడువు.. 47.12 శాతమే వసూలు



బకాయి వసూలుకు వెళ్లిన ఉద్యోగులు



ఆస్తిపన్ను చెల్లించాలంటే డ్రెయినేజీలు నిర్మించాలంటూ సిబ్బందితో శ్రీశ్రీనగర్‌వాసి వాగ్వాదం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీని నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ చేసినా.. పన్నుల వసూలు పరిస్థితి మాత్రం మారలేదు. ఆస్తి పన్ను వసూలుకు బల్దియా ఉద్యోగులు, సిబ్బంది ఆపసోపాలు పడుతున్నారు. మంచిర్యాల మున్సిపాలిటీని ప్రభుత్వం ఇటీవల నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ చేసింది. మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీతోపాటు హాజీపూర్ మండలంలోని 8 గ్రామాలను నగరపాలక సంస్థలో విలీనం చేసింది. విస్తీర్ణం పెరగడం, పన్ను బకాయిలు సైతం ఎక్కువగా ఉండడంతో, సంస్థ ఉద్యోగులు, సిబ్బంది సెలవు రోజుల్లోనూ పన్నుల వసూలుకు పాట్లు పడుతున్నారు. ఒక్కొక్కరుగా వెళితే, పన్ను బకాయిదారులు చెల్లించడం లేదని, ఒకేసారి 30 మందితో వెళ్లి మరీ వసూలు చేస్తున్నారు. గత ఆదివారం(మార్చి 16న) 30 మంది మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలిసి శ్రీశ్రీనగర్‌లో మొండి బకాయిదారుల ఇళ్లకు వెళ్లి రూ.52 వేల పన్ను వసూలు చేశారు. ఇంటి ఆవరణలోనే కూర్చుని పన్ను చెల్లించి, నగర అభివృద్ధికి సహకరించాలని యజమానులను కోరుతూ, పన్ను వసూలు చేశారు. కొన్నేళ్లుగా పన్ను చెల్లింపుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్న వారి జాబితాతోనే పన్ను వసూళ్లకు వెళ్తున్నారు. మార్చి 16న ఒక్కరోజే మొండి బకాయిలు రూ.3 లక్షలకు పైగా పన్ను వసూలు చేశారు. ఈ నెలాఖరు వరకు 70 శాతం టార్గెట్ పెట్టుకున్నారు.

లక్ష్యం చేరడం కష్టమే..

మంచిర్యాల మున్సిపాలిటీగా ఉన్నప్పుడు 27 వేల ఇళ్లు, రూ.18 కోట్ల పన్ను డిమాండ్ ఉండేది. నస్పూరు మున్సిపాలిటీలో 16 వేల ఇళ్లు, రూ.4.27 కోట్ల పన్ను డిమాండ్ ఉండగా, కార్పొరేషన్‌గా ఏర్పడిన తరువాత ఈ రెండు మున్సిపాలిటీలతోపాటు, హాజీపూర్ మండలంలోని 8 గ్రామాలను విలీనం చేశారు. దీంతో కార్పొరేషన్ పరిధిలో మొత్తం ఇళ్ల సంఖ్య 45,327కు చేరగా, పన్ను డిమాండ్ రూ.26.04 కోట్లకు చేరింది. ఇప్పటి వరకు రూ. 12.66 కోట్లు(47.12 శాతం) మాత్రమే వసూలు చేశారు. వారం రోజుల్లో రూ. 14.21 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఏళ్ల తరబడి, పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసులను ఇచ్చి, చెల్లించని వారి ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నారు. అయినా బకాయిదారుల నుంచి స్పందన రావడం లేదు.

మూకుమ్మడిగా సత్ఫలితాలు..

మున్సిపల్ అధికారులు, సిబ్బంది వేర్వేరుగా కాకుండా, మూకుమ్మడిగా పన్ను వసూలుకు వెళ్లడంతో, కొంతమేర సత్ఫలితాలు ఇస్తోంది. 80 శాతంకు పైగా పన్ను వసూలు చేస్తే ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చే అవకాశం ఉన్నందున, ఈనెల 31వ తేదీలోపు 70 శాతం దాటి పన్ను వసూలు చేయాలని అధికారులు, సిబ్బంది కార్యాలయాన్ని వదిలేసి, పన్ను వసూళ్లకు వెళుతున్నారు. ఏళ్ల తరబడి బకాయిలు ఉన్నవారు, పెద్ద మొత్తంలో బకాయి పడ్డవారికి రెడ్ నోటీసులను ఇచ్చి, వారిపై మున్సిపల్ చట్టప్రకారంగా చర్యలను తీసుకుంటేనే ఈ నెలాఖరులోపు అనుకున్న లక్ష్యం మేరకు పన్ను వసూలయ్యే అవకాశం ఉంది. ఏళ్ల తరబడి పన్ను చెల్లించనివారిపై చర్యలు తీసుకోక పోవడం, ఏటా చెల్లిస్తున్న వారే తిరిగి చెల్లించడం వలన వంద శాతం లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. నగరపాలక సంస్థగా మారిన తర్వాత మంచిర్యాలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి నిధులు అవసరం అవుతాయి. 70 శాతంకు పైగా పన్ను వసూలు చేస్తేనే కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు మరిన్ని చర్యలను తీసుకోవాలి.

బడికి రాని హెచ్‌ఎం

- 23 రోజులుగా విధులకు గైర్హాజర్
- డీటీడీవోకు ఫిర్యాదు

వేమనపల్లి: చేయని తప్పుకు తనను సస్పెండ్ చేశారని ఓ హెచ్‌ఎం.. సస్పెన్షన్ ఎత్తివేసినా విధులకు హాజరు కావడం లేదు. వేమనపల్లి మండలంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బియ్యం పక్కదారిపై గతనెల 14న 'సాక్షి'లో ప్రచురితమైంది. విచారణ జరిపిన ఉన్నతాధికారులు ఫిబ్రవరి 24న హెచ్‌ఎం శ్రీనివాస్‌ను బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేశారు. 26న బెల్లంపల్లి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం డి.మాధవ్‌ను వేమనపల్లి పాఠశాలకు ఇన్‌చార్జిగా నియమిస్తూ ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీ చేశారు. అయితే మాధవ్ 2024 నవంబర్ 6న మంచిర్యాల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఫుడ్ పాయిజన్ ఘటనలో సస్పెండ్ అయ్యాడు. తనకు సంబంధం లేకపోయినా ఐటీడీఏ అధికారులు తనను సస్పెండ్ చేశారని, సస్పెన్షన్ ఎత్తివేసినా విధులకు రావడం లేదు. వేమనపల్లి బాధ్యతలు అప్పగించిన తర్వాత మూడు రోజులు మాత్రమే విధులకు హాజరయ్యారు. మార్చి 1వ తేదీ నుంచి విధులకు డుమ్మా కొడుతున్నాడు. మెడికల్ లీవ్‌లో ఉన్నానంటూ విధులకు గైర్హాజరవుతున్నాడు. ఉన్నతాధికారులు మాత్రం ఆయనకు ఎలాంటి లీవ్ లేదని తెలిపారు. హెచ్‌ఎం రాకపోవడంతో ఈ నెల 20వ తేదీలోపు అందించాల్సిన ఉపాధ్యాయుల జీతాల బిల్లులు, డైట్ బిల్లులు, ఓఈ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో డీటీడీవో అంబాజీరావుకు ఉపాధ్యాయులు, వర్కర్లు ఈనెల 22న ఫిర్యాదు చేశారు. ఈ నెల 25లోపు బిల్లులు చేయకుంటే ల్యాప్స్ అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై హెచ్‌ఎం మాధవ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

అమ్మో.. అబాస్!

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొత్త హాజరు విధానం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ
- వ్యతిరేకిస్తున్న వైద్యులు, సిబ్బంది



మాతా శిశు ఆరోగ్య కేంద్రం

మంచిర్యాలటౌన్: వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొత్తగా అబాస్ (ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టం) అమలుకు ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, పల్లె, బస్తీ దవాఖానాల్లో వైద్యులు, సిబ్బంది హాజరు నమోదు చేసేందుకు తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ అభివృద్ధి చేసిన మొబైల్ ముఖ ఆధారిత, జియో ఫెన్స్‌డ్ విధానంలో నూతన సాంకేతికతను తీసుకువచ్చింది. ముందుగా పైలట్ ప్రాజెక్టుగా దీనిని ఖమ్మంలో అమలు చేశారు. ఇప్పటి వరకు బయోమెట్రిక్‌తో పాటు, ఫేస్ యాప్ ద్వారా హాజరు తీసుకునే వారు. కానీ జిల్లా వ్యాప్తంగా చాలా ఆస్పత్రుల్లో బయోమెట్రిక్ గానీ ఫేస్ యాప్ ద్వారా హాజరు తీసుకోకుండానే విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం అమలులోకి తీసుకువచ్చిన అబాస్ హాజరుతో గైర్హాజర్‌కు పూర్తి చెక్ పెట్టవచ్చని, విధులకు డుమ్మా కొట్టేవారి విషయంలో కఠినంగా వ్యవహరించేందుకే దీనిని అమలులోకి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఈ విధానం ఇప్పటికే ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, వాటికి అనుబంధంగా కొనసాగుతున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో అమలు చేస్తున్నారు.

ఉద్యోగుల్లో వ్యతిరేకత

వైద్య ఆరోగ్య శాఖలోని వైద్యులు, సిబ్బంది హాజరు కోసం బయోమెట్రిక్, ఫేస్ యాప్‌లను వినియోగిస్తున్నారు. అయినప్పటికీ అబాస్ పేరిట తీసుకువచ్చిన నూతన విధానాన్ని వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులతో చర్చించకుండానే అమలు చేస్తున్నట్లుగా ఉత్తర్వులు విడుదల చేయడాన్ని వైద్యులు, సిబ్బంది తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిరసన తెలిపేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో అబాస్ హాజరు అమలు కానున్న ఆస్పత్రులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	17
అర్బన్ హెల్త్ సెంటర్లు	4
బస్తీ దవాఖానాలు	3
పల్లె దవాఖానాలు	100
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	3
ఎంసీహెచ్	1
ఆయూష్ ఆస్పత్రులు	33
జిల్లా ఆస్పత్రి	1

పింఛన్ కోసం నిరీక్షణ



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు అట్టెల మల్లయ్య. కోటపల్లి మండలం రాపన్‌పల్లికి చెందిన ఇతనికి ఎనిమిదేళ్ల క్రితం కిడ్నీ చెడిపోయిందని డాక్టర్లు చెప్పారు. ఆరేళ్ల మందులు వాడాడు. రూ.8 లక్షల వరకు చికిత్సకు ఖర్చు చేశాడు. అయినా మెరుగు పడకపోవడంతో రెండేళ్ల నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. నెలకు 15 రోజులు డయాలసిస్ చేయించుకోవాలి. డయాలసిస్‌కు ఒంటరిగా వెళ్లలేడు. మరో సహాయకుడిని తీసుకుని వెళ్లాలి. ఇందుకు కేవలం రవాణా చార్జీలకే రూ.4,500 ఖర్చవుతుంది. ప్రభుత్వం పింఛన్ ఇవ్వకపోవడంతో సొంతంగానే ఖర్చు పెట్టుకుంటున్నాడు. మందులకు అదనంగా ఖర్చవుతుందని తెలిపాడు.

- డయాలసిస్ రోగులను పట్టించుకోని ప్రభుత్వం
- భారంగా బతుకీడుస్తున్న రోగులు
- ఆదుకోవాలని వేడుకోలు



చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ బాధితులు

చెన్నూర్: జిల్లాలో డయాలసిస్ రోగుల ఆర్థిక కష్టాలు ఎవరికీ పట్టడం లేదు. రెక్కల కష్టాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న నిరుపేదలు కిడ్నీలు దెబ్బతినడంతో డయాలసిస్ కోసం రెండు రోజులకు ఒకసారి ఆస్పత్రికి వెళ్తున్నారు. ఒక కిడ్నీ చెడిపోయిన వారు మరో కిడ్నీ బాగుండేందుకు డయాలసిస్ చేయించుకుంటున్నారు. లేదంటే మరో కిడ్నీ కూడా చేడిపోయే ప్రమాదం ఉంది. దీంతో రవాణా ఖర్చులు భారమైనా తప్పనిసరి పరిస్థితిలో ఆస్పత్రులకు వెళ్తున్నారు. ప్రభుత్వం కిడ్నీ బాధితులకు పింఛన్లు ఇస్తుంది. అయితే కొత్తగా వ్యాధిగ్రస్తులను ఎంపిక చేయడంలేదు. దీంతో పేద రోగులు పింఛన్లు రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

ఇదీ పరిస్థితి...

జిల్లాలో 145 మంది డయాలసిస్ పేషంట్లు ఉన్నారు. మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో 66 మంది, బెల్లంపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో 34 మంది, చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో 45 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. రోజు విడిచి రోజు ఉదయం ఆస్పత్రికి వస్తే సాయంత్రం వరకు ఉండాల్సిన పరిస్థితి. వీరే కాకుండా వీరితో వచ్చే సహాయకులు కూడా నిరీక్షించాల్సిందే. ప్రభుత్వం గతంలో డయాలసిస్ పేషంట్లకు నెలకు రూ.2 వేల పెన్షన్ ఇచ్చేది. కొత్తగా డ యాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ బాధితుల కు పింఛన్లు రావడం లేదు. దీంతో కిడ్నీ రోగులు ఇ బ్బంది పడుతున్నారు. తమ ప్రాణాలు అంటే ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పెన్ష న్లు మంజూరు చేసి అదుకోవాలని కోరుతున్నారు.

జిల్లాలో డయాలసిస్ రోగుల వివరాలు

సెంటర్ పేరు	పెన్షన్ వస్తున్నవారు	పెన్షన్ రానివారు	మొత్తం
మంచిర్యాల	32	34	66
చెన్నూర్	15	30	45
బెల్లంపల్లి	14	20	34

కండ్లు కనిపిస్తలెవ్వు..



నాది భీమారం మండలం కొత్తపల్లి. కిడ్నీలు దెబ్బతిన్నాయి. డయాలసిస్ చేయించుకుని బతుకుతున్నా. రోజు రోజుకు అవయవాలన్నీ చెడిపోతున్నాయి. కళ్లు కనిపిస్తలెవ్వు. కిడ్నీ బాధితులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. డయాలసిస్ చేయించుకుంటున్న వారికి నెలకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలి. బస్సులలో ఉచిత పాస్‌లు అందజేయాలి.

– సంజీవరెడ్డి, కొత్తపల్లి

కట్టెపట్టుకుని నడుస్తున్నా..



నాది కోటపల్లి మండలం నక్కలపల్లి. ఆరేళ్ల నుంచి డయాలసిస్ చేయించుకుంటున్న. నడుము లేదు కట్టే పట్టుకుని నడుస్తున్నా.. ఆటోలో డయాలసిస్‌కు పోతున్న. నెలకు రూ.5 వేలు ఆటో చార్జీలకే అవుతున్నయ్. మావోళ్లు నానా కష్టపడి చార్జీలకు డబ్బులు ఇస్తుండ్రు. ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయాలి.

– ఆరె బానయ్య నక్కలపల్లి

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టైటిల్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మూడోస్థానం కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం అభినందించారు. జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులు జూమిడి కార్తీక్, శ్యామ్, సిద్ధార్థ్ ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోనె శ్యాంసుందర్‌రావు, కనపర్తి రమేశ్ తెలిపారు. బీహార్ రాష్ట్రంలో ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో క్రీడాధికారి అలుగువెల్లి రమేశ్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పీడీలు రోజా వరకుమారి, రేణి రాజయ్య, ఎస్టీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా, హ్యాండ్‌బాల్ కోచ్ సునార్కర్ అరవింద్, కళ్యాణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని గాడియం స్పోటియా పాఠశాలలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి మెడల్స్‌ను సాధించినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సాంబమూర్తి, మారయ్య తెలిపారు. 100, 400 మీటర్ల జావెలిన్‌త్రో పోటీల్లో జిల్లాకు చెందిన బి.శృతి సిల్వర్ మెడల్, జి.రాజేశ్వరి బ్రాంజ్ మెడల్‌ను సాధించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సీఐ

భైంసారూరల్ (ముధోల్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రాంపూర్‌కు చెందిన సాయన్న, చర్లపల్లికి చెందిన రఫీక్ ఆదివారం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై సుంక్లి గ్రామానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో వానల్‌పాడ్ గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సీఐ నైలు, స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విషాహారం తిని మూడు ఎద్దులు మృతి


ఎద్దు కళేబరం

మామడ: మండలంలోని గాయిద్‌పల్లిలో విషాహారం తిని మూడు ఎద్దులు మృత్యువాతపడ్డాయి. జాదవ్ పండరీకి చెందిన మూడు ఎద్దులు ఆదివారం పంటచేను సమీపంలో మృతిచెంది ఉన్నాయి. సంఘటన స్థలాన్ని పశువైద్యాధికారి మహేశ్ సందర్శించి వివరాలు సేకరించారు. విషాహారం తినడంతో మృతి చెందాయని పేర్కొన్నారు. వీటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

అనారోగ్యంతో ఏఎంసీ మాజీ చైర్మన్ మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

ఇంద్రవెల్లి: అనారోగ్యంతో ఏఎంసీ మాజీ చైర్మన్ సోమసే వెంకట్‌రావ్(76) మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన ఈయన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. 2005లో ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. గత కొంతకాలం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. పరిస్థితి విషమించి మండలకేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఘటన స్థలానికి చేరుకుని వెంకటరావ్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి లోటన్నారు. ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, కాంగ్రెస్ నాయకులు మీర్జా యాకుబ్ బేగ్, ఎండీ మసుద్, జహీర్, గ్రామపటేల్ మారుతి డొంగ్రె తదితరులు ఉన్నారు.

కోరలుచాస్తున్న 'క్షయ'

రెండు వారాలకు మించి దగ్గు ఉందా..అయితే టీబీ అయ్యిండొచ్చు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి ఉచిత పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి నిర్ధారణ అయితే వైద్యులు మందులిస్తారు. చిన్నపాటి దగ్గే కదా అని నిర్లక్ష్యం చేస్తే అదే రేపు ప్రాణాంతకం అవ్వొచ్చు. ముందుగా జాగ్రత్త పడితే ఆరోగ్యం మీ చేతుల్లోనే భద్రంగా ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో చాప కింద నీరులా వ్యాపిస్తున్న క్షయ వ్యాధికి కళ్లెం వేయాలి. అందరం కలిసి క్షయను నిర్మూలించగలం అనే నినాదంతో ఈ ఏడాది ముందుకెళ్తున్నారు. నేడు ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

- ఏటా పెరుగుతున్న రోగుల సంఖ్య
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా నిష్ప్రయోజనం
- నేడు ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం


మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సీబీనాట్ యంత్రం

మంచిర్యాలటౌన్: టీబీ నిర్మూలనకు ప్రభుత్వం నడుంబిగించింది. వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నా క్షయ వ్యాధి తగ్గుముఖం పట్టకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో చాపకింద నీరులా క్షయ విస్తరించడం, కొన్నేళ్లుగా వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నా, ఏటా బాధితులు పెరుగుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 2025 నాటికి టీబీని నిర్మూలించడమే లక్ష్యంగా గత ఐదేళ్లుగా కృషి చేస్తున్నా, ఏటా వీరి సంఖ్య వెయ్యికి పైగానే నమోదవుతోంది.

వ్యాధిని గుర్తిస్తారు ఇలా..

టీబీ.. మైకో బ్యాక్టీరియా ట్యూబర్‌కిలోసిస్ ద్వారా సంక్రమిస్తుంది. ఊపిరితిత్తులకు లేదా శరీరంలోని ఇతర భాగాలకు రెండు రకాలుగా వ్యాపిస్తుంది. 85 శాతం మందికి ఊపిరితిత్తులకే సోకడం గమనార్హం. రెండు వారాలకు మించి దగ్గు ఉండడం, సాయంత్రం వేళ జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతీనొప్పి, దగ్గినప్పుడు రక్తంతో కూడిన తెమడ వస్తే వ్యాధి లక్షణాలుగా చెప్పవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. బాధితులకు వ్యాధి తీవ్రత బట్టి ఆరు, ఎనిమిది నెలలు, రెండేళ్ల కోర్సు ప్రకారం మందులు వాడాల్సి ఉంటుంది. వ్యాధిగ్రస్తుడు దగ్గినా, తుమ్మినా తుంపర్లు వాతావరణంలో కలిసి బ్యాక్టీరియా ద్వారా ఇతరులకు సంక్రమిస్తుంది. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు దీని బారిన పడతారు. హెచ్ఐవీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, అతిగా మద్యం సేవించేవారు, పొగతాగేవారు, గర్భిణులు, పిల్లల తల్లులు, సరైన పోషకాహారం తీసుకోనివారు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు త్వరగా దీని బారినపడే ప్రమాదం ఉంది. చికిత్సలో భాగంగా వ్యాధిగ్రస్తులు ప్రతీరోజు ట్యాబ్లెట్లను వేసుకునేలా ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) చికిత్స విధానాన్ని అనుసరిస్తున్నారు. ఈ వ్యాధిని నిర్ధారణకు అధునాతన సీబీనాట్(క్యాట్రిజ్ బేస్డ్ న్యూక్లిక్ ఆసిడ్ ఆంప్లీ క్లీన్ టెస్టు) విధానం (క్షయ నివారణ విభాగం కేంద్రం) మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో ఉండగా, బెల్లంపల్లి సీహెచ్‌సీలో టునాట్ మిషన్లను అందుబాటులోకి తెచ్చారు. మంచిర్యాల జిల్లా ఆసుపత్రిలో టీబీ టెస్టుల కోసం ప్రత్యేక గదిని కేటాయించి, సీబీనాట్‌తో పరీక్ష చేసి, చికిత్స అందిస్తున్నారు. టెస్టుల కోసం ట్రూనాట్ మిషన్‌ను ఏర్పాటు చేయగా, అనుమానితుల నుంచి శాంపిళ్లను సేకరించి, వ్యాధిని నిర్ధారిస్తున్నారు.

ఐదేళ్లలో గుర్తించిన టీబీ కేసులు

సంవత్సరం	మంచిర్యాల	ఆదిలాబాద్	నిర్మల్
2020	1,138	1218	1529
2021	1,284	1361	1208
2022	1,445	1565	1549
2023	1,413	1467	1378
2024	1,278	1602	1097

చికిత్సతో పాటు నగదు

క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్స పూర్తయ్యే వరకు నిక్షయ పోషణ యోజన కింద నెలకు రూ.వెయ్యి ఇస్తారు. ఈ డబ్బును వారి ఖాతాల్లో జమచేసి, ఆధార్, బ్యాంక్ ఖాతాలతో నిక్షయ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ప్రైవేటు నర్సింగ్‌హోంలు, ల్యాబ్‌లో పరీక్షలు చేసుకుని, వ్యాధి నిర్ధారణ అయితే వ్యాధిగ్రస్తుల వివరాలను సమీప ప్రభుత్వ ఆసుపత్రిలోని టీబీ యూనిట్ సిబ్బందికి తెలియజేయాలి. ఈ డబ్బులతో వ్యాధిగ్రస్తుడు బియ్యం, పప్పుదినుసులు, గుడ్లు, పాలు, కూరగాయలు కొనేందుకు గాను ఈ మొత్తాన్ని ఉపయోగించాలి. నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా దాతలు పౌష్టికాహార పదార్థాలు అందజేస్తారు.

లక్షణాలుంటే పరీక్ష చేసుకోవాలి



చిన్నారులకు బి.సి.జి టీకా వేయడం వల్ల వారు క్షయ బారిన పడే అవకాశాలు తక్కువ. ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ నిర్ధారణ పరీక్షలు చేసి, వ్యాధి సోకిన వారికి మందులు అందిస్తున్నాం. రెండు వారాల కంటే ఎక్కువ రోజులు దగ్గు ఉండి, సాయంత్రం జ్వరం వచ్చే వారు ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి. క్షయ నివారణ జిల్లాగా మార్చేందుకు అందరి సహకారం ఉండాలి.

– హరీశ్‌రాజ్, డీఎంహెచ్‌వో, మంచిర్యాల

ఆత్మీయ సమ్మేళనం



తాంసిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఒకరికొకరు ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు. పూర్వ ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, రఘురమణ, బాపన్న, వాణిశ్రీ, పూర్వ విద్యార్థులు సురేశ్, శ్రీధర్‌రెడ్డి, సంజీవ్, కపిల్, అనిత, సునీత, గణిత, జ్యోత్స్న తదితరులు ఉన్నారు. – తాంసి

సింగరేణి కార్మికుల ప్రయోజనాలే ముఖ్యం

- ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

నస్పూర్: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల ప్రయోజనాలే ముఖ్యమని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం నస్పూర్ కాలనీలోని సేవాభవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సింగరేణి, కాంట్రాక్టు, రిటైర్డు కార్మికుల ఆత్మీయ సదస్సులో పాల్గొని మాట్లాడారు. సింగరేణి సంస్థ మూతపడితే దక్షిణ భారత దేశ పారిశ్రామిక వ్యవస్థ అస్తవ్యస్తం అవుతుందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో అనేక భూగర్భ గనులు, ఓసీలు మూతపడ్డాయని ఆరోపించారు. జైపూర్ పవర్ ప్లాంటు ఏర్పాటు మాజీ సీఎం వైఎస్సార్ ఘనత అని, ఏటా రూ.500 కోట్ల లాభాలను సింగరేణి ఆర్జిస్తోందన్నారు. సింగరేణి మనుగడ కొనసాగాలంటే కొత్త గనులు రావాలన్నారు. ఇందుకు సింగరేణి సంస్థ బొగ్గు గనుల వేలంలో పాల్గొనాలన్నారు. డిపెండెంట్ల వయస్సు 35 నుంచి 40 ఏళ్లకు పెంచడం, ఉద్యోగులకు రూ.1.50 కోట్ల ఇన్సూరెన్స్, కాంట్రాక్టు కార్మికులకు ఇన్సురెన్స్ సదుపాయం కల్పించామని, 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు దీపావళి బోనస్ రూ.5 వేలు ఇప్పించామని అన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, సమ్మయ్య, ధర్మపురి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శులు తిరుపతిరెడ్డి, రమేశ్, శ్రీనివాస్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి శ్యాం పాల్గొన్నారు.

ఎద్దులను తరలిస్తున్న రెండు ట్రాలీలు పట్టివేత

కాసిపేట:అక్రమంగా రెండు ట్రాలీలలో 8 ఎద్దులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..వాంకిడికి చెందిన షేక్ ఇసూబ్, షేక్ అసీంలు రెండు ట్రాలీలో 8 ఎద్దులను వాంకిడి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మండలాల్లోని సంతల్లో కొనుగోలు చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా రాజారాంపల్లి సంతలో విక్రయించేందుకు ట్రాలీలో వెళ్తున్నారు. శనివారం రాత్రి కాసిపేట పోలీసుస్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై మధుర జంక్షన్ వద్ద పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎద్దులను సంరక్షణ ని మిత్త ం సుల్తానాబాద్‌లోని గోశాలకు తరలించినట్లు పశువైద్యాధికారి పేర్కొన్నారు.

వ్యవసాయ భూమిలో గంజాయి సాగు

- 17 మొక్కలను ధ్వంసం చేసిన పోలీసులు


గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కొర్టికల్ గ్రామ శివారులో గల వ్యవసాయ భూమిలో పద్వాల్ దశరథ్ అనే రైతు అంతరపంటగా గంజాయి సాగు చేస్తున్నాడు. మూడేళ్లుగా భూమిని కౌలుకు తీసుకొని మిరప, వంగ, బెండ పంటల్లో అంతరంగా గంజాయి సాగు చేస్తున్నాడనే సమాచారం మేరకు పోలీసులు ఆదివారం తనిఖీ చేశారు. 17 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. దశరథ్‌తో పాటు ఆయన భార్య సాగర్‌బాయిపై కేసు నమోదు చేయగా, దశరథ్ పరారీలో ఉన్నాడు. సాగర్‌బాయిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పట్టుబడిన మొక్కల విలువ రూ.1లక్ష 70వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

రైతు అరెస్ట్

చెన్నూర్: మండలంలోని కొమ్మెర శివారులోని పత్తి చేనులో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న రైతును అరెస్టు చేసినట్లు సీఐ దేవేందర్ తెలిపారు. మండలంలోని ఎర్రగుంటపల్లికి చెందిన రైతు జనగామ గట్టుమల్లు..కొమ్మెర శివారులో రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. అక్రమంగా గంజాయి పెంచితే డబ్బులు వస్తాయని ఆశతో చేనులో అక్కడక్కడ గంజాయి సాగు చేస్తున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు ఆదివారం చేనుకు వెళ్లి అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.గట్టుమల్లును రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందన్‌పల్లి రేంజ్‌లో న్యాయమూర్తి


స్వాగతం పలుకుతున్న రేంజ్ అధికారి

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని ఇందన్‌పల్లి రేంజ్‌లో ఆదిలాబాద్ జిల్లా సివిల్ న్యాయమూర్తి ప్రమీల జైన్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పర్యటించారు. న్యాయమూర్తికి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం మైసమ్మకుంట, ఘనిషెట్టి కుంట, వాచ్‌టవర్ ప్రాంతాలను పరిశీలించారు. అడవి అందాలను చూసి మురిసిపోయారు. అడవి అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను రేంజ్ అధికారి న్యాయమూర్తికి వివరించారు.

సైబర్ వలలో యువకుడు

- రూ.2.12 లక్షలు పోగొట్టుకున్న వైనం
- మందమర్రిలో ఘటన..కేసు నమోదు

మందమర్రిరూరల్: సైబర్ వలలో పడి యువకుడు రూ.2.12 లక్షలు పోగొట్టుకున్నాడు. మందమర్రిలో ఈఘటన చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం..పట్టణానికి చెందిన యువకుడికి గూగుల్‌లో రివ్యూ ఇస్తూ డబ్బులు సంపాదించవచ్చని ఒక టెలిగ్రామ్ పేరిట నేరగాళ్ల నుంచి మెసెజ్ వచ్చింది. దానికి అంగీకరించడంతో అతన్ని 3వేల మంది ఉన్న టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేశారు. ముందుగా పెట్టుబడి రూపంలో కొన్ని డబ్బులు పెట్టాడు. అధిక మొత్తంలో ఆశచూపి తర్వాత రూ.2.12 లక్షలు పెట్టించారు. తర్వాత నగదు విత్ డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా నేరగాళ్లు హ్యాక్ చేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన యువకుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి జిల్లా మహాసభ

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో ఆదివారం తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి జిల్లా 3వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు సంజీవరావు మాట్లాడుతూ ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద దేశాల మెప్పు కోసం పాలకులు పాటుపడుతున్నారని విమర్శించారు. ఓపెన్ కాస్టుల విధ్వంసం, టైగర్ జోన్‌లతో ప్రజలు నిర్వాసితులుగా మారుతున్నారన్నారు. ఓపెన్‌కాస్టుల విధ్వంసాన్ని ఆపాలని, టైగర్ జోన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మంచిర్యాల జిల్లా కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా శ్రీ మన్నారాయణ, ప్రధాన కార్యదర్శి జైపాల్‌సింగ్, ఉపాధ్యక్షులుగా చంద్రయ్య, పోశం, అనంద్ సంతోష్, శ్రీనివాస్, సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో జైపాల్‌సింగ్, శ్రీమన్నారాయణ, ప్రజాకళామండలి నాయకులు సమ్మయ్య, చంద్రమౌళి, శ్రీనివాస్, రాజన్న, కుమార్ పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో ముగిసిన టెక్‌ఫెస్ట్


పరిశీలిస్తున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: బాసర ఆర్జీయూకేటీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంత:ప్రజ్ఞ టెక్‌ఫెస్ట్ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఇంజినీరింగ్ విద్యార్థుల వినూత్న ఆలోచనలు, సామర్థ్యాలను ప్రదర్శించేందుకు టెక్‌ఫెస్ట్ నిర్వహించినట్లు ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ తెలిపారు. ఇందులో విద్యార్థుల ప్రాజెక్టు నమూనాలు, పోస్టర్ ప్రజెంటేషన్లు, తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధర్శన్, ఏవో రణధీర్ సాగి, అసోసియేటెడ్ డీన్స్, వివిధ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

26న మామిడిపండ్ల తోటల వేలం

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ ఉట్నూర్ పరిధిలోని ఉద్యాన నర్సరీలో మామిడిపండ్ల తోటల వేలం ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. బంగినపల్లి, దసేరి, తోతాపరి, రసాలు, హిమాయత్, లాంగ్ర తదితర మామిడి హైబ్రిడ్ రకాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు రూ.10 వేల డిపాజిట్ చెల్లించి ఉదయం 10 గంటలకు జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు. వేలంలో తోట దక్కించుకున్నవారు సగం నగదును వెంటనే చెల్లించాలని మిగతాది వారంలో చెల్లించాలని సూచించారు. ఆ తర్వాతే కాయలు కోయడానికి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 8897478825, 9441020755 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కుమురం భీం పేరుతో అవార్డులు గర్వకారణం

- మాజీ రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి
- సినీనటుడు సాయికుమార్‌కు భీం అవార్డు ప్రదానం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


కుమురం భీం జాతీయ అవార్డు అందుకుంటున్న సాయికుమార్

ఆసిఫాబాద్: కుమురం భీం పేరుతో జాతీయ అవార్డు ప్రదానం చేయడం ఆదివాసీ జాతికి గర్వకారణమని మాజీ రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో భారత్ కల్చరల్ అకాడమీ, ఆదివాసీ సాంస్కృతిక పరిషత్, ఓం సాయితేజ ఆర్ట్స్, నవజ్యోతి సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ గోడం నగేశ్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాస రావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, హాస్య నటుడు బాబూమోహన్, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి, నవజ్యోతి వ్యవస్థాపకులు దండనాయకుల సురేశ్‌కుమార్, భీమ్ మనవడు సోనేరావుతో పాటు పలువురు సినీ ప్రముఖులతో కలిసి సినీనటుడు సాయికుమార్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎన్నికల అధికారి పార్థసారథి మాట్లాడుతూ కుమురం భీం జీవితం ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. అడవి మీద హక్కుల కోసం జల్ జంగల్ జమీన్ నినాదంతో నిజాం పాలకులతో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీరుడు కుమురం భీం అన్నారు. అవార్డు గ్రహీత సాయికుమార్ మాట్లాడుతూ కుమురంభీం సినిమాలో నటించి, భీమ్ నడియాడిన ప్రాంతంలో జాతీయ అవార్డు పొందడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కళాకారుడిగా పుట్టడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, కుమురం భీం చరిత్రను ప్రపంచం దృష్టికి తీసుకెళ్తున్న డి సురేశ్‌కుమార్‌ను అభినందించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో ఎంతోమంది ఉన్నత స్థాయి గిరిజన కళాకారులున్నారని, ఇటీవల గుస్సాడీ నృత్యానికి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించిందని గుర్తు చేశారు. నవజ్యోతి సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు దండనాయకుల సురేశ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, జలపాతాలు, ప్రముఖ దేవాలయాలు అభివృద్ధి చేయాలన్నారు. తొలుత జిల్లా కేంద్రంలోని సాయి మందిరం, అంకమ షా సమాధి మందిరాన్ని దర్శించుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సినీ కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో యువ దర్శకుడు నక్క రాహుల్, నిర్మాత రాం సత్యనారాయణ, నటుడు రాంజగన్, బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, ఆదివాసీ నాయకుడు సిడాం అర్జు, నవజ్యోతి సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, సాయిని రాజశేఖర్, కళాకారులు, ఆదివాసీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'భూభారతి'తో రెవెన్యూలో మార్పులు


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి


పాల్గొన్న ఉమ్మడి జిల్లా రెవెన్యూ ఉద్యోగులు

మంచిర్యాలటౌన్: భూభారతి చట్టం 2025తో రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సేవలందించేందుకు 10,954 మంది గ్రామపాలన అధికారులు వచ్చారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు సైనికులుగా పనిచేస్తామన్నారు. అనతికాలంలోనే ప్రభుత్వ సహకారంతో ఎన్నో విజయాలను సాధించుకున్నామని, తొలిసారి 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను ఏర్పాటు చేసి, పూర్వ వీఆర్ఏ, వీఆర్వోలను మాతృ సంస్థలోకి తీసుకోవడం గొప్ప విజయమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, టీజీటీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షం, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఆలం పోచయ్య, ప్రధాన కార్యదర్శి ఆత్రం ప్రహ్లాద్, మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శ్రావణి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వి.సంజీవ్ కుమార్, ఆదిలాబాద్ జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్డీవోలు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందిస్తున్నాం


మాట్లాడుతున్న ఎల్వీ సూర్యనారాయణ

నస్పూర్: సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, కళాశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నామని సింగరేణి డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ(ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు(ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు, పర్సనల్ అడ్మినిస్ట్రేషన్)తెలిపారు. సీసీసీ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన 17వ వార్షికోత్సవానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో విద్యాసంస్థల ద్వారా సింగరేణి ఉద్యోగుల పిల్లలకు, తెలంగాణలోని ఇతర విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన విద్యనందించి వారి బంగారు భవిష్యత్తుకు సంస్థ దోహదపడుతుందన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం వారు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్, సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్, కళాశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, ప్రిన్సిపాల్ డి నరసింహస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

అడవిలో అమ్మవారి విగ్రహం


చాముండేశ్వరి విగ్రహం

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజురా, బావాపూర్(ఆర్), మామడ మండలం కప్పనపల్లి గ్రామాల మధ్య గల దట్టమైన అడవిలో చాముండేశ్వరి అమ్మవారి విగ్రహం బయటపడింది. విగ్రహ పరిసర ప్రాంతంలో 14వ శతాబ్దానికి చెందిన కోట శిథిలాలను ప్రముఖ చరిత్ర పరిశోధకుడు, ఖానాపూర్ వాసి కరిపె రాజ్‌కుమార్ గుర్తించారు. కోట చుట్టూ చెక్కు చెదరని రాతి కంచె, ఇనుము శుద్ధిచేసిన ఆనవాళ్లు లభ్యమయ్యాయి. కోటకు ఆవల గుప్తానిధుల కోసం జరిపిన తవ్వకాల్లో ఇటీవల ఒక రాతి విగ్రహం బయటపడిందని వివరించారు. గ్రామాల ప్రజలు ఒక చిన్న చెట్టు కింద ఉంచారని, ఆ విగ్రహ ప్రతిమ చాముండేశ్వరి దేవతదని, కాకతీయ అనంతర శైలిలో విగ్రహం ఉందని తెలిపారు. దేవత చతుర్భుజి అని, పర(వెనుక) హస్తాలో ఢమరుకం, త్రిశూలం ఉన్నాయని, నిజ (ముందు) హస్తాలలో ఖడ్గం, రక్తపాత్రలతో సుఖాసీనురాలై ఉన్నారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఈ అమూల్యమైన విగ్రహాన్ని, కోట శిథిలాలను ప్రజలు సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. పరిశోధక బృందంలో ఔత్సాహిక పరిశోధక విద్యార్థి కరిపె రాజశేఖర్, గ్రామస్తుడు చిట్నేని పోతన్న ఉన్నారు.